క్లుప్తంగా

కఠిన చర్యలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్: పులివెందుల మండలం తుమ్మలూరులో యూట్యూబర్ ఆదిశేషుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ నేత లోగిడి జయన్న డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీకి చెందిన ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి రజక కులానికి చెందిన ఆదిశేషును అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేయడం దుర్మార్గమన్నారు. రజక యువకుడిపై జరిగిన ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో యూట్యూబర్ ఆదిశేషు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ప్రచారం చేశారనే అక్కసుతో, అగ్రకుల దురహంకారంతో అకారణంగా కులంపేరుతో దూషిస్తూ విచక్షణ రహితంగా కొట్టడం దారుణమన్నారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదన్న సత్యాన్ని విశ్వనాథరెడ్డి గ్రహించాలన్నారు. దాడికి పాల్పడిన విశ్వనాథరెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఆగస్టు 20 నుండి 25 వరకు ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల్లో రాష్ట్ర సమితి సభ్యులుగా 81 మంది, కార్యవర్గ సభ్యులుగా 33 మందితో రాష్ట్ర కౌన్సిల్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. ఈ సభలో తనను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇదే మహాసభలో జిల్లా నుండి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి. రామయ్య, ఎల్. నాగసుబ్బారెడ్డి, వి. వీరశేఖర్, ఎన్. వెంకటశివ రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు.

డీసీఈబీ హాల్ నిర్మాణానికి చొరవ తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: కడప జెడ్పీ ఆవరణంలో చేపట్టిన డీసీఈబీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం చొరవ తీసుకుని త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్ రెడ్డిలు కోరారు. ఈ విషయమై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని గురువారం కడపలో కలిసి వారు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలోని పదివేల మంది ఉపాధ్యాయులకు సంబంధించిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) కార్యాలయ నిర్మాణానికి సహకరించాలని ఆయనను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ సోషల్ మీడియా కన్వీనర్ శివారెడ్డి, మైనారిటీ కన్వీనర్ సనావుల్లా, ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందాలి



పుస్తకాలను అందజేస్తున్న పంచాయతీరాజ్ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కృష్ణమూర్తి

కడప సెవెన్‌రోడ్స్ : విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందాల్సిన అవసరం ఎంతో ఉందని పంచాయతీరాజ్ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కృష్ణమూర్తి అన్నారు. గురువారం నగరంలోని సాయిబాబా హైస్కూలుకు నైతిక, ఆధ్యాత్మిక విలువలున్న పలు పుస్తకాలను ఆయన అందజేశారు. సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ మాట్లాడుతూ బాల్యం నుంచే పఠనాశక్తి పెంపొందించే విధంగా వారికి గ్రంథాలయాల నుంచి తెలియజేయాలన్నారు. వారంలో కనీసం రెండు గంటలైనా గ్రంథాలయంలో గడిపేలా వారికి బోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా విద్యా సంస్థల డైరెక్టర్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పాఠశాల సీఈఓ శ్రీదేవి, ప్రధాన నిర్వాహకులు సుదీప్‌రెడ్డి తెలిపారు.

సులభ్‌శాఖ ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈ సులభ్ శాఖను ఆ బ్యాంకు జీఎం పాండురంగయ్య, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్‌కే అగర్వాల్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ అధికారి అరుణజ్యోతి, డీఎంలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వక్రతుండ మహాకాయ



ఆర్వీఎస్‌ఆర్ నగర్‌లో..



ప్రకాష్‌నగర్‌లో..




వినాయక చవితి వేడుకలలో భక్తులు



పాతమునిసిపల్ కార్యాలయంలో..



వినాయకచవితి వేడుకలలో పాల్గొన్న మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ఊటుకూరులో..



కడప నగరం శ్రీనగర్ కాలనీలో..

కడప సెవెన్‌రోడ్స్ : విఘ్నాలు తొలగించి సర్వ శుభాలను ప్రసాదించే గణనాథుని చవితి వేడుకలు బుధ, గురువారాల్లో జిల్లా ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా విగ్రహాలుగల పందిళ్లన్నీ ఉదయం, సాయంత్రం భక్తజనంతో పోటెత్తాయి. నగరంలో భారీగా నిర్మించిన చిన్నచౌకు, ఎన్జీఓ కాలనీ, రాజీవ్ మార్గ్‌లలోని పందిళ్ల వద్ద భక్తులు కిటకిటలాడారు. పిల్లలు, పెద్దలు నిలువెత్తు గణపతి మూర్తులను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యార్థులు ఇళ్లలో పూజలు నిర్వహించే సమయంలో తమ పాఠ్య పుస్తకాలను పూజలో ఉంచారు. తమకు చదువులు బాగా రావాలని కోరుకున్నారు. కుటుంబాలతోసహా ఉదయం, సాయంత్రం సమీపంలోని వీలైనన్ని పందిళ్లలోని స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులైన యువకులు రోజంతా భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి చిన్నారుల సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పౌరాణిక, భక్తి నాటక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భజనలు నిర్వహించారు.

మట్టి గణపతి మనసాస్మరామి..

మార్కెట్‌లో మట్టి విగ్రహాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రసార మాధ్యమాలు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పలుచోట్ల చిన్నసైజు మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. విగ్రహాల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించిన దాతలను పండుగ నాడు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కడప నగరంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాష, నగర మేయర్ సురేష్‌బాబు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఇంకా పలువురు రాజకీయ ప్రముఖులు వినాయక స్వామి పందిళ్ల వద్ద పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

భక్తజన సందడి

కడప నగరం రాజీవ్‌మార్గ్, ఎన్జీఓ కాలనీ, చిన్నచౌకు ఆంజనేయస్వామి ఆలయం వద్దగల పందిరిలో భారీ విగ్రహాలను దర్శించుకునేందుకు భక్తజనం బారులు తీరారు. గతంలో లాగానే ఈమారు కూడా ఏర్పాటు చేసిన భారీ వినాయక పందిరిని, భారీ సెట్టింగ్‌ను చూసేందుకు, ఈ పందిట్లోని స్వామిని దర్శించుకునేందుకు సమీప వీధులకు చెందిన భక్తులు కుటుంబాలతోసహా తరలివచ్చారు. రాజీవ్‌మార్గ్‌కు ఇరువైపుల రోడ్లు జనంతో నిండిపోయాయి. రోడ్లకు ఇరువైపుల దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం తిరునాలను తలపించింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. పెద్ద సైజు వినాయక విగ్రహాల వద్ద రాజసౌధాలను తలపించేలా ఏర్పాటు చేసిన అలంకరణను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్వీఎస్‌ఆర్ నగర్‌లో..

స్థానిక ఆర్వీఎస్‌ఆర్ నగర్‌లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విగ్రహాన్ని సాంకేతికతను ఉపయోగించి తీర్చిదిద్దారు. విగ్రహం కళ్లు తెరవడం, మూయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వినాయకుడిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు ముండ్ల నవనీశ్వర్‌రెడ్డి, ముసల నాగసుబ్బారెడ్డి, ముండ్ల శివారెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

కడప కార్పొరేషన్: కడప నగరంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం చిన్నచౌకులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక స్వామిని మేయర్ సురేష్ బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

– కడప నగరపాల సంస్థ కార్యాలయ ఆవరణంలో ఉన్న వినాయకస్వామి ఆలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో మేయర్ సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వినాయక చవితిని పురస్కరించుకొని నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లికార్జున, అజ్మతుల్లా, రామలక్ష్మణ్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు కిరణ్, బసవరాజు, ఆర్‌ఐ విశ్వనాథరెడ్డి, సూపరింటెండెంట్ జి.శివకుమార్ పాల్గొన్నారు.

– కడప నగరంలోని 30వ డివిజన్‌లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో కార్పొరేటర్ షఫీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి కొలువుదీర్చారు. వినాయక మంటపాలను అందంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా వినాయక కల్యాణం

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం బెల్లంమండిలోని శ్రీ ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ, ధర్మకర్తల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కళ్లు చెదిరేలా అలంకరించి కొలువుదీర్చారు. కల్యాణ సంప్రదాయమైన ఎదుర్కోలు ఉత్సవాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. అర్చకుల బృందం కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాదంగా అక్షతలను అందజేశారు. స్థానిక వీధులకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఘనంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో షఫీవుల్లా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



ఆదరణ వృద్ధాశ్రమంలో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



జిల్లా పరిషత్ వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా జరిగాయి. బుధవారం ఉదయం నబీకోట శివాలయంలో వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీం ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి అన్నదానం చేశారు. ఆ తర్వాత ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో కేక్ కటింగ్ నిర్వహించి, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ సురేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు పాకా సురేష్ కుమార్, ఐస్‌క్రీం రవి, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

– జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీమ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా లు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

– రిమ్స్‌లో వైఎస్ అవినాష్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ ఛైర్మెన్ రామగోవిందు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయంత్రం పెద్ద దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. పార్టీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో...

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా కార్యాలయంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మేయర్ సురేష్ బాబు, అంజద్‌బాషాలు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, దాసరి శివప్రసాద్, సుభాన్ బాషా, షఫీ, వెంకటేశ్వర్లు, షంషీర్, గౌస్, టీపీ వెంకట సుబ్బమ్మ, బి. మరియలు పాల్గొన్నారు.

ఆదరణ వృద్ధాశ్రమంలో ...

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కడప పాత రిమ్స్‌లోని ఆదరణ వృద్ధాశ్రమంలో కుమార కాల్వ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ పంచాయితీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రేమాలయంలో...

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ప్రేమాలయం నిరాశ్రయుల వృద్ధాశ్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి షేక్ షఫీవుల్లా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమానికి మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీహెచ్ వినోద్‌కుమార్, నరసింహ కుమార్, మురళీ, సంపత్, చైతల్య పాల్గొన్నారు.

– ప్రకాష్ నగర్‌లోని స్నేహాలయ అనాథాశ్రమంలో పార్టీ మహిళా నాయకురాలు చైతల్య, సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు.

నిధులు కేటాయించాలి

కడప రూరల్: బద్వేల్ నియోజకవర్గంలో గల సగిలేరు గురుకుల పాఠశాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని అఖిలపక్ష నేతలు కోరారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు నారాయణ, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సాగిలి గుర్రప్ప, అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సి ఆర్ వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా శశిభూషణ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర బీజేపీ నాయకత్వం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వంగల శశిభూషణ్ రెడ్డిని నియమించింది. ఈ మేరకు ఆయనను రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అభినందించారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ తనకు రాష్ట్ర అధికార ప్రతినిధిగా పదవి ఇచ్చిన రాష్ట్ర నాయకత్వానికి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర బీజేపీ నాయకులు, కేంద్ర బీజేపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మూడు సార్లు జిల్లా అధ్యక్షులుగా, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసిన తనకు రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేసే అవకాశం దక్కిందన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్రంలోని పాలక ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నాయని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ అమరుల ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టి విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ 2000 సంవత్సరం ఆగస్టు 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వామపక్షాలు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో శాంతియుతంగా ర్యాలీ జరుగుతుండగా నాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విచక్షణారహితంగా కాల్పులు జరిపి రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలను పొట్టన పెట్టుకుందన్నారు. అనేకమంది వామపక్ష నాయకులు కార్యకర్తలు పోలీసు లాఠీలకు, గుర్రాల దాడులకు, తుపాకి దెబ్బలకు గాయాల పాలయ్యారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేసే వరకు అమరవీరుల స్ఫూర్తితో పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

మైనంపాటికి ఘన నివాళి



మైనంపాటి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్: తెలుగు సూర్యుడు సి.పి.బ్రౌన్‌కు తన చిత్రలేఖన నైపుణ్యంతో రూపమిచ్చి ప్రాణంపోసిన మేటి చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం అని యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గురువారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో సి.పి.బ్రౌన్ ఊహా చిత్రకారుడు మైనంపాటి 108వ జయంతిని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముందుగా ఆచార్య టి.శ్రీనివాస్, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి మైనంపాటి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఆచార్య టి.శ్రీనివాస్, ఆచార్య జి.పార్వతి , జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ మైనంపాటి కృషి బహుముఖమని అన్నారు. సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి , డా. చింతకుంట శివారెడ్డి మాట్లాడారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతో వాటి వినియోగం గురించి తెలుసుకుని ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు పిలుపునిచ్చారు. కడప నగరం దండు గిరిజనుల కాలనీలో 'గిరిజన ప్రజలలో బాల్య వివాహాలు – చిన్న వయసులోనే గర్భధారణ' తదితర అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రవీణ్ కుమార్, రవితేజ, రెడ్స్ ఎన్జీవో కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పారిశ్రామికంగా ఎదగాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికంగా ముందుకు నడవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని బాలాజీ నగర్ మై భారత్ ,నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ఫ్లాగ్ షిప్ పథకాలపైన వర్క్ షాప్ నిర్వహించారు. మై భారత్ జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

నగరంలో వర్షం







కడప నగరంలో బుధవారం, గురువారం కురిసిన వర్షాలకు రహదారులు జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల ప్రధాన రహదారులలో సైతం మోకాలు లోతు వరకు వాన నీరు ప్రవహించింది. వ్యాపారులు , వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. - ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కడప